www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 6 సెప్టెంబర్ 2023

5

ఏలూరు

డిఆర్ఒ, ఆర్‌డిఒ బదిలీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా రెవెన్యూ అధికారి, ఏలూరు ఆర్‌డిఒను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు డిఆర్ఒగా పని చేస్తున్న ఎవిఎస్ఎన్.మూర్తిని బాపట్ల డిఆర్ఒగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో కృష్ణా జిల్లా డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు ఆర్‌డిఒగా పని చేస్తున్న పెంచలకిషోర్‌ను తిరుపతి డిఆర్ఒగా బదిలీ చేయగా ఆయన స్థానంలో ఖాజావలీని నియమించింది. బదిలీలైన అధికారులు వెంటనే తమ స్థానాల్లో చేరాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.



డిఆర్ఒ వెంకటేశ్వర్లు

చినుకు రాలదు.. నేల తడవదు..!

- మబ్బులు, ఉరుములతోనే ఊరడింపు
- వర్షం కోసం అన్నదాత ఎదురుచూపులు
- ఎండిపోతున్న పొలాలు, చెరువులు
- ఆగస్టులో భారీగా వర్షపాతం లోటు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మబ్బులు, ఉరుములతో ఊరించడమే తప్ప చినుకు రాలదాయే.. నేల తడవదాయే అన్నట్లు పరిస్థితి తయారైంది. గడిచిన నెల రోజులకుపైగా జిల్లాలో వర్షం జాడ లేకుండాపోయింది. గడిచిన నెలలో సరాసరిన 238.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా పట్టుమని 90.9 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే పడింది. వర్షపాతం లోటుతో పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. వేసవి ఎండలను తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జనం ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో ఈ నెల ఏడో తేదీ వరకూ సాధారణం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వర్షాల వారం అన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెలలో ఇప్పటికే ఐదురోజులు గడిచిపోయాయి. అయితే జిల్లాలో వాన చినుకు జాడ లేకుండాపోయింది. ఎక్కడైనా కురిసినా చినుకులు పడి ఆగిపోతుంది. మబ్బులు, ఉరుములతో ఊరిస్తున్నప్పటికీ వర్షం మాత్రం పడటం లేదు. గడిచిన 24 గంటల్లో ఏలూరు జిల్లాలో సరాసరి వర్షపాతం 3.1 మిల్లీమీటర్లు నమోదైంది. దీన్నిబట్టి వర్షం పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. పశ్చిమలో 2.13 లక్షల ఎకరాల్లో వరిసాగు సాగింది. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో పంటల పరిస్థితి ప్రమాదంలో పడటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మెట్టప్రాంతం కావడంతో వర్షాధారం, మోటారు బోర్లపై పంటలు పండే పరిస్థితి ఉంది. నెలకుపైగా వర్షాలు పడకపోవడంతో పంటపొలాలు బీటలు వారిపోతున్న పరిస్థితి ఉంది. చింతలపూడి, లింగపాలెం, ద్వారకాతిరుమల, కుక్కునూరు, వేలేరుపాడు వంటి మండలాల్లో వర్షాభావ ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. చెరువులు సైతం ఎండిపోయాయి. దీంతో గుక్కెడు నీటి కోసం పశువులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. డెల్టాలో కాలువల ద్వారా సాగునీరు అందుతున్నప్పటికీ శివారు ప్రాంతాలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర ఎండలతో పంటలకు తెగుళ్లు సోకుతున్నాయంటూ రైతులు లబోదిబోమంటున్నారు. వర్షాలు కురవకపోతే జిల్లాలోని చాలా మండలాలను కరువు కమ్ముకునే ప్రమాదం ఉంది. వర్షపాతం లోటుతో మోటారు బోర్లు సైతం సరిగా పనిచేయని పరిస్థితి నెలకొంది. మరోపక్క కరెంటు కోతలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎండల తీవ్రతకు ఆక్వా రైతులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నా చినుకు మాత్రం పడటం లేదు. దీంతో రైతులతోపాటు సామాన్య ప్రజానీకంసైతం వర్షం కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. పైరు, పంటలు సైతం వర్షాలు లేక దెబ్బతింటున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఖరీఫ్ సాగు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.15 వేలకుపైగా పెట్టుబడులు పెట్టారు. ఈ తరుణంలో పంట దెబ్బతింటే అన్నదాత తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ ప్రభావం వచ్చే రబీపైనా పడనుంది. దీంతో రైతులకు ఏం చేయాలో తెలీక లోలోన మదనపడుతున్నారు. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. బ్యాంకుల నుంచి పంట రుణాలు ఇవ్వకపోవడంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టారు. పంట చేతికందకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. దీంతో వర్షాల కోసం రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఉత్తమ బోధన సాగించాలి

ఉపాధ్యాయ దినోత్సవ సభలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు

అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న ప్రముఖులు

ఉపాధ్యాయులు ఉత్తమ బోధన సాగించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు దోహదపడాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో మంగళవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పద్మశ్రీ, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ గురువుల విశిష్టతను విశదీకరించారు. విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టి వేలాది కోట్ల రూపాయలతో విద్యాభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి బాటలు వేశారన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు వెలకట్టలేనివన్నారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారి పట్ల ఎటువంటి వివక్షా చూపకుండా ఆందరినీ సమభావంతో చూడాలని హితవు పలికారు. చిన్నతనంలో ఉపాధ్యాయులు చెప్పిన మాటలు నేటికీ మనకు గుర్తుంటాయన్నారు. తన ఉపాధ్యాయులను గుర్తు చేసుకుని వారికి సభాముఖంగా వందనాలు తెలిపారు. ఈ రోజు తాను ఈస్థాయిలో ఉన్నానంటే ఆనాటి ఉపాధ్యాయుల ప్రభావమేనని అన్నారు. మట్టిని మలిచి ఒక విగ్రహం చేసినట్లు పిల్లలకు నాణ్యమైన ఉత్తమ విద్య అందించి వారు ఉన్నత స్థానానికి చేరుకునేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. పేదరికం నుంచి బయటపడేందుకు చదువే ముఖ్యమన్నారు. ప్రతిఒక్కరూ తాము ఆర్జించిన విజ్ఞానాన్ని అర్థమయ్యేటట్లు మిగిలిన వారికి పంచాలన్నారు. ప్రస్తుతం ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యాబోధనను రాష్ట్రప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం సమాజంలో పోటీ ఎదుర్కొనేలా, ఆధునికతకు అనుగుణంగా మన పిల్లలను సుశిక్షితులుగా తయారు చేయడానికి దృఢ సంకల్పంతో ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కైకలూరు ఎంఎల్ఎ డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుని స్థాయి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లిని ఉపాధ్యాయ లోకం మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ మన దేశ సంస్కృతిలో గురువుస్థానం ఎంతో విశిష్టమైనది, అత్యున్నతమైనదని అన్నారు. నాడు-నేడు ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డిఇఒ పి.శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పించారు. అనంతరం గండికోట రాజేష్ శిష్యబృందంతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం అందరినీ అలరించింది. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమంగా నిలిచిన 20 మంది అవార్డుగ్రహీత ఉపాధ్యాయులను సత్కరించారు.

సమస్యలు పరిష్కరించాలని విఒఎల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పీడీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విఒఎలు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వెలుగు విఒఎలు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పీడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ వెలుగు విఒఎలు గత 20 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తూ చాలీచాలని వేతనాలతో రోజులు గడుపుతున్నారని, వీరికి వెంటనే కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుంటే వేతనాలు పెంచే దాంట్లో మాత్రం ప్రభుత్వాలు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విఒఎలచే వెట్టిచాకిరీ చేయించుకుని ఉత్తి చేతులు చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఇస్తున్న వేతనాలు గ్రామసంఘాల్లో వేస్తున్నారని, ఎపిఎం, సీసీ, ఒబిలు సంతకాలు పెడితేగాని ఆ వేతనాలు తీసుకోవడానికి లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విఒఎల వేతనాలు వారి బ్యాంకు ఖాతాల్లోనే వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విఒఎల సంఘం జిల్లా నాయకులు షేక్ సుభాషిణి మాట్లాడుతూ పథకాలు బ్రహ్మాండంగా ప్రజలకు అందిస్తూ విఒఎలు సేవలందిస్తున్నారని, వారికి మూడు సంవత్సరాల కాల పరిమితి, వయో పరిమితి 45 సంవత్సరాలు పెట్టడం దారుణమని అన్నారు. మహిళా మార్ట్, కోళ్ళు మేకలు గొర్రెలు, గేదెలు టార్గెట్లు పెట్టి పని చేయిస్తున్నారని విమర్శించారు. యాప్‌ల్లో అప్‌లోడ్ చేయాలంటే ప్రభుత్వమే స్మార్ట్‌ఫోన్లు అందించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని సుభాషిణి డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌డిఎ అధికారి విజయ్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని, రాష్ట్రస్థాయి సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ధర్నా అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షులుగా సిహెచ్.నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా షేక్ సుభాషిణి, మరో 20 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తాం

పాదయాత్రలో అభివాదం చేస్తున్న లోకేష్

- ఉండి ప్రజలను గుండెల్లో పెట్టుకుంటా
- భీమవరానికి పట్టిన కేన్సర్ గడ్డ ఎంఎల్ఎ గ్రంధి
- గోదావరి జిల్లాల ప్రజల కన్నీటిని తుడిచే బాధ్యత తీసుకుంటా
- బహిరంగ సభలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్
- భీమవరం ప్రకాశం చౌక్‌లో ఫ్లెక్సీ రగడ

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

'జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు.. 2.30 లక్షల ఉద్యోగాలు కల్పించ లేదు.. ప్రతియేటా 6,500 పోలీసు ఉద్యోగాలు ఇవ్వలేదు.. మెగా డిఎస్‌సి లేదు.. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏదీ అమలు చేయలేదు.. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతియేటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రంలో పెండింగులో ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ప్రభుత్వ, ప్రయివేట్, స్వయం ఉపాధి ద్వారా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 205వ రోజు మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు భీమవరం శివారు నరసింహపురం నుంచి ప్రారంభమైంది. ఉండి రైల్వే గేట్, మల్టీప్లెక్స్, బొంబే స్వీట్ సెంటర్, అంబేద్కర్ సెంటర్ వరకూ సాగింది. అక్కడ లోకేష్‌ను గజమాలతో సత్కరించారు. అనంతరం పాదయాత్ర ప్రకాశం చౌక్‌కు చేరుకోగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ ప్రసంగించారు. టిడిపి కంచుకోట పశ్చిమగోదావరి జిల్లా అని అన్నారు. రెచ్చగొట్టే ఫ్లెక్సీలు పెడుతున్నారని, మేము ఫ్లెక్సీలు వేయడం మొదలుపెడితే జగన్‌కు గుండెపోటు వస్తుందన్నారు. అబ్బాయిలు కిల్డ్ బాబాయ్ అంటూ ప్లకార్డును లోకేష్ బహిరంగ సభలో ప్రదర్శించారు. ఇసుక లేకుండా చేసి భవన నిర్మాణ కార్మికులకు, పరిశ్రమలు తరిమేసి యువతకు, ఆక్వా రంగాన్ని నాశనం చేసి ఆక్వా రైతులకు హాలిడే ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్ పాలనలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో రైతులు నష్టపోతున్నారన్నారు.

పశ్చిమ అంటే చంద్రబాబుకు అపార ప్రేమ

పశ్చిమగోదావరి జిల్లా అంటే చంద్రబాబుకు అపారమైన ప్రేమ అని లోకేష్ అన్నారు. 2014లో 15కి 15 సీట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజలు టిడిపికి కట్టబెట్టారని గుర్తు చేశారు. సబ్సిడీలు, రాయితీలు ఇచ్చి ఆక్వా రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించి దేశంలోనే నెంబర్ వన్‌గా చేస్తామన్నారు.

ఉండి ప్రజలను గుండెల్లో పెట్టుకుంటా

ఉండి నియోజకవర్గం టిడిపి అడ్డా అని, జగన్ మాటలు నమ్మకుండా 2019లోనూ మంతెన రామరాజుని గెలిపించారని, తాను ఉండి ప్రజలను గుండెల్లో పెట్టుకుంటానని లోకేష్ అన్నారు. ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన టిడిపి దేనని, అప్పటి ఎంఎల్ఎ శివ చంద్రబాబు నవారంతో రూ.1100 కోట్లతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. తాము అధికారం చేపట్టిన వెంటనే ఆకివీడు నగర పంచాయతీలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కోపల్లె బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని, ఉండి సెంటర్‌లో ఉన్న బ్రిడ్జి కొత్తది నిర్మిస్తామన్నారు. మొగల్లు, కోరుకొల్లు గ్రామాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగు నీరందిస్తామని చెప్పారు. కిడ్నీ బాధితుల కోసం నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న లోకేష్

భీమవరానికి పట్టిన కేన్సర్ గడ్డ.. ఎంఎల్ఎ గ్రంధి

టిడిపి హయాంలో భీమవరాన్ని సుమారు రూ.1500 కోట్లతో అభివృద్ధి చేశామని లోకేష్ అన్నారు. 8250 టిడ్కో ఇళ్లు నిర్మించారన్నారు. ఎంఎల్ఎ గ్రంధి తన ఇంటి ముందు రోడ్డు తప్ప నియోజకవర్గంలో ఎక్కడైనా రోడ్లు వేశారా అని ప్రశ్నించారు. కనీసం రోడ్లపై గుంతలు పూడ్చలేని ఎంఎల్ఎ భీమవరానికి అవసరమా అని ప్రశ్నించారు. భీమవరానికి పట్టిన కేన్సర్ గడ్డ గ్రంధి శ్రీనివాస్ అని ఘాటుగా విమర్శించారు. సొంత పార్టీ నేతలే గ్రంధి అవినీతి గురించి సిఎంకు ఫిర్యాదు చేశారన్నారు. సెంటు స్థలాల పేరుతో తక్కువ ధరకు భూములు కొని ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మేశాడని ఆరోపించారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప, దొంగపిండి ప్రాంతాల్లో వందల ఎకరాల అసైన్డ్ భూముల్లో అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వారన్నారు. భూదందాలను బయటపెట్టిన సొంతపార్టీ నాయకులపైనే కేసులు పెట్టించిన ఘనుడు ఎంఎల్ఎ గ్రంధి అని ఆరోపించారు.

మిషన్ గోదావరి ప్రకటిస్తా

తన పాదయాత్ర ఉభయగోదావరి జిల్లాలు దాటేలోపు మిషన్ గోదావరి ప్రకటించి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని నారా లోకేష్ ప్రకటించారు. భీమవరానికి మోడరన్ డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తానన్నారు. రింగ్ రోడ్డు ఏర్పాటు చేసి భీమవరాన్ని మోడల్ టౌన్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. శివారు ప్రాంతాలకు రోడ్లు, విద్యుత్, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఉండి, పాలకొల్లు ఎంఎల్ఎలు మంతెన రామరాజు, నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, కెఎస్.జవహర్, మాజీ ఎంఎల్ఎలు బండారు మాధవనాయుడు, వేటుకూరి వెంకట శివరామరాజు, మాజీ జెడ్‌పి ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం యాత్ర పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా సాగి పట్టణ శివార్లలోని తాడేరు వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి చేరింది.

ఫ్లెక్సీ వివాదం

యువగళం పాదయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. భీమవరం ప్రకాశం చౌక్‌లో యనమదుర్రు గట్టుపై పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధం అని వైసిపి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ దగ్గర వివాదం తలెత్తింది. ఫ్లెక్సీ వద్ద పోలీసులు ముందుగానే బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీ చించేందుకు వచ్చారని పోలీసులు యువగళం వాలంటీర్లను అడ్డుకున్నారు. దీన్ని వాలంటీర్లు ప్రతిఘటించారు. బాబాయిని ఎవరు చంపారు అని రాసిన ఫ్లెక్సీలను యువగళం వాలంటీర్లు ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో టిడిపి కార్యకర్తలు వైసిపి ఫ్లెక్సీపై రాళ్లు రువ్వి తారాజువ్వలను ఫ్లెక్సీపైకి వేశారు. ఈ క్రమంలో పోలీసులు, టిడిపి కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుని ఉద్రిక్తత ఏర్పడింది. వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్, టూటౌన్ సిఐ గుత్తుల శ్రీనివాస్, రూరల్ సిఐ నాగప్రసాద్ వైసిపి ఫ్లెక్సీ ప్రాంతానికి ఎవరూ రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

తాడేరు టౌన్‌షిప్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

పలువురికి గాయాలు

లోకేష్ యువగళం పాదయాత్రలో మంగళవారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. టిడిపి, వైసిపి శ్రేణులు పరస్పరం రాళ్లతో దాడికి తెగబడ్డాయి. ఈ ఘటనలో కానిస్టేబుల్ రమేష్, టిడిపి మండలాధ్యక్షుడు పృధ్వీకి బలమైన గాయాలైనట్లు సమాచారం. పోలీసులు రంగంలోకి దిగినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

నినదిస్తున్న నేతలు

కార్మిక కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన

ఎస్ఐ, ఎఎల్ఒ జోక్యంతో పరిహారం అందజేతకు అంగీకారం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని సీతానగరం గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ పరిశ్రమలో సోమవారం ప్రమాదవశాత్తూ మరణించిన ఒడిశ్శాకు చెందిన సోహెల్‌శెట్టి కుటుంబానికి న్యాయం చేయాలని గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. పరిశ్రమలో ప్రమాదం జరిగి కార్మికుడు చనిపోయినా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ప్రభుత్వాసుపత్రి మార్చురీ వద్ద కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. యాజమాన్యం నష్ట పరిహారం ప్రకటించే వరకు మృతదేహాన్ని ఇక్కడి నుంచి తరలించే ప్రసక్తి లేదని అక్కడే బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ అక్కడికి చేరుకుని కార్మికులతో చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి రూ.ఐదు లక్షలు ఎక్స్‌గ్రేషియా, కాంట్రాక్టర్ నుంచి రూ.2.40 లక్షలు పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇఎస్ఐ పెన్షన్ ఉరూ.9 వేలు లేదా వర్క్‌మెన్ కాంపెన్సేషన్ యాక్ట్ ప్రకారం రూ.14.60 లక్షలు ఇచ్చేలా అంగీకారం కుదిరింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ యాజమాన్యం మానవత్వం లేకుండా చనిపోయిన కార్మికుని కుటుంబానికి న్యాయం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పరిశ్రమలో నిబంధనలకు విరుద్ధంగా లేబర్ కాంట్రాక్టర్లు లైసెన్స్ లేకుండా మైగ్రేట్ లేబర్ లైసెన్స్ కూడా లేకుండా అడ్డగోలుగా పని చేయిస్తున్నారని విమర్శించారు. ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్ తనిఖీలు జరగకపోవడం వల్లే పరిశ్రమలో ఇటువంటి ప్రమాదాలు జరుగు తున్నాయన్నారు. ప్రభుత్వం కార్మికుల ప్రాణాల కంటే యాజమాన్యాల లాభార్జనే ధ్యేయంగా పని చేయడం బాధాకరమన్నారు. పరిశ్రమలను నిరంతరం తనిఖీలు చేయాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని పరిశ్రమల్లో పూర్తిస్థాయిలో రక్షణ పరికరాలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండలాధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు, నేత సత్యనారాయణ, యూనియన్ నాయకులు పి.పెద్దిరాజు, బి.నాగరాజు, గణేష్, తాతారావు, ప్రసాద్, సాయిబాబు, సుబ్బారావు నాయకత్వం వహించారు.

కలెక్టర్‌ను కలిసిన డిఎంహెచ్ఒ, డిసిహెచ్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

డిఎంహెచ్ఒగా నియమితులైన డాక్టర్ ఎస్.శర్మిష్ట కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఇన్యూనైజేషన్ అధికారిగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై ఏలూరు డిఎంహెచ్ఒగా నియమితులయ్యారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిఎంహెచ్ఒ

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిసిహెచ్ఎస్

జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డిసిహెచ్ఎస్)గా నియమితులైన డాక్టర్ బి.పాల్‌సతీష్‌కుమార్ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన తణుకులో ఇఎన్‌టి సివిల్ సర్జన్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై ఏలూరు డిసిహెచ్ఎస్‌గా నియమితులయ్యారు.

భారాలు నిరసిస్తూ సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - మండవల్లి

మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలిస్తూ ప్రజలపై మోయలేని భారాలు వేస్తోందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ విమర్శించారు. అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సింగనపూడిలో ఆక్రమణకు గురైన ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ భూములను తిరిగి దళితులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. రెవిన్యూ అధికారులు పెత్తందారులకు కొమ్ముకాయడం దారుణమని విమర్శించారు. దళితుల భూమి దళితులకు అప్పగించని పక్షంలో భూస్వాధీనోద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రాజ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉచ్చుల సుధీర్‌కుమార్, పక్కిరి దావీదు, బొడ్డు చింతయ్య, పాముల యెహోషువా, మేరుగు ఛార్లెస్, పాలడుగుల శాంతాభాయి, పులవర్తి కమలమ్మ, శ్యామల రామస్వామి పాల్గొన్నారు.

అమెరికా పర్యటనకు ట్రిపుల్ ఐటి విద్యార్థులు

నూజివీడు రూరల్ : ట్రిపుల్ ఐటీలో పియుసి-1 చదువుతున్న నలుగురు విద్యార్థులు అమెరికా పర్యటనకు ఎంపికైనట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అమెరికా పర్యటన నిమిత్తం ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో అన్ని జిల్లాల్లో 1, 2 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అర్హత పరీక్ష నిర్వహించిందన్నారు. దీనికి 105 మంది విద్యార్థులు హాజరు కాగా తుది దశలో పదిమందిని ఎంపిక చేసి అమెరికా పర్యటనకు పంపిస్తున్నట్లు తెలిపారు. వీరంతా ఈనెల 15వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ యునైటెడ్ నేషన్స్ ప్రధాన కార్యాలయం, కొలంబియా విశ్వవిద్యాలయం, ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయం ప్రాంతాలలో మాట్లాడతారని పేర్కొన్నారు.

మద్ది ఆలయానికి రూ.1.31 లక్షల ఆదాయం

జంగారెడ్డిగూడెం : మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చిన యాత్రికులు 1000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. మంగళవారం ఆలయానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ఈ క్రమంలో ప్రసాద అమ్మకం, అన్నదాన విరాళాలు, పూజా టిక్కెట్ల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.లక్షా 31 వేల 17లు సమకూరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు సరిత విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

దాత సహకారంతో రోడ్డు నిర్మాణం

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ప్రముఖ సామాజికవేత్త గోగినేని విజయ గోపాల్ విరాళంతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త విజయ గోపాల్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో భాగంగా 110 మీటర్ల పొడవున సిమెంటు రోడ్డు నిర్మాణానికి, ప్రజలందరి కోరిక మేరకు రూ.10.50 లక్షల వెచ్చిస్తున్నట్లుగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బి.వెంకటేశ్వరమ్మ, ఎంపిటిసిలు చల్లారి రేణుక, ధనలక్ష్మి, తటుకులూరి రామయ్య పాల్గొన్నారు.

విద్యా కానుకల పరిశీలన

నూజివీడు రూరల్ : పట్టణంలోని ఎంఆర్‌సి కార్యాలయంలోని గోదాములో విద్యా కానుకలను జిల్లా సిఎంఒ జె.రవీంద్ర, ఎపిఎస్ఎస్ నుంచి ఎస్.అబ్దుల్ ఘనీ మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిశీలించారు. 2018-19లో విద్యార్థులకు పంపిణీ చేసిన ఏకరూప దుస్తులు అక్కడ కనిపించాయి. తర్వాత సంవత్సరం ప్రభుత్వం ఏకరూప వస్త్రాల రంగును మార్చడంతో పాత వాటిని పక్కన పెట్టినట్లు గుర్తించి, వీటిని అనాథలకు అందించాలని ఆదేశించారు. ఆయా పాఠశాలలకు అవసరం ఉంటే పంపిణీ చేయాలని ఎంఇఒ-2 ఎస్.జమలయ్యను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన

జంగారెడ్డిగూడెం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సచివాలయాల వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని పదవ వార్డు సచివాలయం మహిళా పోలీస్ నజ్మ తెలిపారు. మంగళవారం స్థానిక సిఎస్‌టిఎస్ కళాశాల విద్యార్థులకు ప్రాజెక్ట్ రిపోర్ట్ నేపథ్యంలో సచివాలయ వ్యవస్థపై డాంగే నగర్ పదవ సచివాలయం అంబేద్కర్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నజ్మ మాట్లాడుతూ విద్యార్థులు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, అంతర్జాల లోన్‌యాప్‌లపై ఎదురవుతున్న ఇబ్బందులను గురించి అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌టిఎస్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇళ్ల మ్యాపింగ్ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిఎల్‌పిఒ మహ్మద్‌రజాఉల్లా తెలిపారు. మంగళవారం మండలంలోని తాటియాకులగూడెం పంచాయతీలోని బర్రింకలపాడు గ్రామంలో జరుగుతున్న ఇళ్ల మ్యాపింగ్(స్వమిత్వ) సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వమిత్వ పథకంలో భాగంగా చేపడుతున్న ఇళ్ల మ్యాపింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి తెలియజేశారు. అప్పటి వరకు చర్చి నిర్మాణ పనులను ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గోవులను తరలిస్తున్నవారిపై కేసు

జీలుగుమిల్లి : అక్రమంగా గోవులను కబేళాలకు తరలిస్తున్న ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం జీలుగుమిల్లి శివారు హెచ్‌పి గ్యాస్ గొడౌన్ సమీపంలోని జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. విజయనగరం జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఐచర్ వ్యాన్‌లో అక్రమంగా 13 గోవులను కబేళాలకు తరలిస్తుండగా వాహనాన్ని ఆపి స్టేషన్‌కు తరలించి, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారిపై స్థానిక వికాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం గోవులను గోశాలకు తరలించినట్లు తెలిపారు.

పరిస్థితి విషమించి యువకుడు మృతి

భీమడోలు/ఉంగుటూరు : ఉన్నవారి గూడెం గ్రామానికి చెందిన గుర్రం మావుళ్లయ్య(25) మద్యానికి బానిసై, తాగిన మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మావుళ్లయ్య కూలి పనులు చేసుకుంటాడు. డబ్బులు మొత్తం మద్యానికే ఖర్చు పెడుతుండడంతో అతని తండ్రి తీవ్రంగా మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన మావుళ్లయ్య ఈనెల 2న పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న మావుళ్లయ్యను కుటుంబ సభ్యులు వారి సహకారంతో ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై భీమడోలు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సూరిశెట్టి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో దాడి : వ్యక్తి మృతి

ఏలూరు స్పోర్ట్స్ : మద్యం మత్తులో ఉన్న ఒక వ్యక్తి మరో వ్యక్తిని బాటిల్‌తో పొడిచి చంపిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఏలూరు నగరంలోని రూరల్ ప్రాంతం రంగారావు కాలనీకి చెందిన గోపీనాథ్ రామయన్ 26 సోమవారం రాత్రి మద్యం సేవించి అతని స్నేహితుడైన రాజ అనే వ్యక్తి ఇంటికి వెళ్లారు. మార్గమధ్యలో ఏలూరు ఒకటో పట్టణ ప్రాంతంలోని చిరంజీవి బస్టాండ్ వద్ద ఇరువురు మాట్లాడుకుంటుండగా, నాని స్నేహితుడు అయిన పెద్ద వీరేంద్రకుమార్ వద్దకు రావడంతో చిన్నపాటి వివాదం తలెత్తి అతని వద్ద ఉన్న మద్యం సీసాను పగలగొట్టి గోపీ తలభాగంలో పొడిచి పరారయ్యారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఏలూరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అతని పరిస్థితి విషమించి మృతి చెందాడు. మంగళవారం ఉదయం జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి, డిఎస్‌పి శ్రీనివాసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు మొదలు పెట్టారు.

రాగి వైర్లు చోరీ : ఇద్దరు అరెస్ట్

కలిదిండి : మండలంలోని వెంకటాపురం, కొత్తపాలెం అడ్డరోడ్లలోని ఎలక్ట్రికల్ రీవైండింగ్ షాపుల్లో రాగివైర్ కట్టలు చోరీకి పాల్పడిన ఇరువురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎన్.ప్రియ కుమార్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిపై దర్యాప్తు

ఏలూరు స్పోర్ట్స్ : సోమవారం రైలు కిందపడి ఆత్మహత్య పాల్పడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తేజమూర్తి కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఏలూరు ఒకటో పట్టణ సీతాతో పాటు లాయర్ సుబ్బారావు మరో ఉయ్యూరుపై మృతుడి తల్లిదండ్రులు అతని చావుకు కారణం వీరేనని ఆరోపించారు. ఈ విధంగానే రైల్వే పోలీసులు పంచనామా నమోదు చేశారు. ఈ కేసును దర్యాప్తు చేసిన ఆర్డర్ పోలీసులు, తదుపరి దర్యాప్తు నిమిత్తం రైల్వే ఉన్నతాధికారులకు బదిలీ చేయనున్నారు.

నిందితుడికి 6 నెలల జైలు

ముదినేపల్లి : ఓ వృద్ధుడు మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ముద్దాయికి 6 నెలలు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. మండలంలోని చేవూరు గ్రామానికి చెందిన మొండెం జగన్నాథరావు(70) వృద్ధుడు అదే గ్రామానికి చెందిన మైనర్ బాలిక అమ్మతో స్కూలుకు వస్తున్న సమయంలో, ఇంటికి రమ్మని బాలికను పిలిచాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన ఎస్ఐ షణ్ముఖసాయి గత ఏడాది జగన్నాథరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో జడ్జి ముద్దాయికి 6 నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

బధిరుల పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో 'ఉపాధ్యాయ దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉపాధ్యాయులు జాతి నిర్మాణంలో ముఖ్య భూమిక పోషిస్తారన్నారు. అనంతరం సిపిడిసి సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. అనంతరం వివిధ తరగతుల విద్యార్థులు మాట్లాడారు. వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకటరావు, సిహెచ్ ఉదయలక్ష్మి, డాక్టర్ విజయకుమార్, ఎస్.పరమేశ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రిన్సిపల్ అధ్యాపకులను

పోలవరంలో సన్మానిస్తున్న ఎంపీపీ, జడ్‌పిటీసి..

శాలువాలతో సన్మానించారు.

వట్లూరు శ్రీకన్వెన్షన్ హాలులో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఏలూరు ఎన్ఆర్ఐ కళాశాలల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల సిఇఒ వి.తులసీరామ్ మాట్లాడుతూ సృష్టిలో తల్లిదండ్రుల తర్వాత భగవంతునికి కూడా దక్కనిస్థానం గురువులకు మాత్రమే దక్కుతుందన్నారు. విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపల్స్ వి. కనకరత్నం, ఇ.మురళీకృష్ణ, కె.ప్రభాకరరావు, ఎస్.సత్యనారాయణ, సిహెచ్.శివకుమార్, సిహెచ్ఎన్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ జి.సంజీవరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పరివర్తన్ బధిరుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ఏలూరు టౌన్ : స్థానిక ఏలూరు దొండపాడులో పరివర్తన్ చెవిటి, మూగ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విభిన్న

ఏలూరు అర్బన్ ఎన్ఆర్ఐ కళాశాలలో

ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జిసిహెచ్.ప్రభాకర్ పాల్గొన్నారు. ఆయన డా.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయునికి ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. ప్రతీ పౌరుడు గౌరవించాల్సిన వ్యక్తి ఉపాధ్యాయుడన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సాధారణ పిల్లలకు విద్య బోధించడమే కష్టం అలాంటిది, బదిరులకి విద్యాభోధన చేయడం చాలా సహనంతో చేయాల్సిన పనని, పరివర్తన్ సంస్థ గత 15 సంవత్సరాలుగా 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని అన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. విద్యార్థినీ, విద్యార్థులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎస్ఎస్‌కె.ప్రసన్న, యు.లక్ష్మిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఎడ్.విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు భారతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, మండల విద్యాధికారి బివి సుబ్బారావు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ దేశం గర్వించే స్థాయిలో ఒక విద్యావేత్తగా, రాష్ట్రపతిగా ఎనలేని సేవ చేశారన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ కె.శౌరి మాట్లాడుతూ విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఉపాధ్యాయుని కృషి ఎంతో ఉంటుందన్నారు. అనంతరం మండల విద్యాధికారిని, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలవరం : మండల విద్యాశాఖ కార్యాలయంలో టీచర్స్ డే సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జడ్‌పిటిసి కలుం హేమ కుమారిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో గురువు పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. అనంతరం ఉపాధ్యాయులను, సిబ్బందిని ఎంపీపీ, జడ్‌పిటిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కలుం హేమ కుమారి, ఎంఇఒ చూడామణి, మండలంలోని టీచర్స్ విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా పట్టణంలో పలు పాఠశాలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక విద్యా వికాస్ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయ వేషధారణ ధరించి తరగతులలో పాఠ్యాంశాలను బోధించారు. ఈ సందర్భంగా విద్యా వికాస్ డైరెక్టర్ పి.సతీష్ చంద్, కరస్పాండెంట్ బి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ విద్యార్థులు గురువులను గౌరవించి చదువులో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ప్రతిభ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయ వస్త్రాలంకరణలో అలరించారు. ప్రిన్సిపల్ లక్ష్మి సరోజా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని లైన్స్ క్లబ్ జిల్లా ఛైర్‌పర్సన్ పంతగాని వెంకన్న అన్నారు. మంగళవారం గురుపూజోత్సవ సందర్భంగా జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 9 మంది ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జిల్లా నాయకులు అట్లూరి సురేష్, మద్దిపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : భావితరాలకు ఉపాధ్యాయులు మార్గదర్శకులని జడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండలంలోని గుర్వాయిగూడెం గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఆదూరి మధు సూదన రావు, వగ్వాల జానియ్యలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.లక్ష్మి, ఎంపిడిఒ మంగాకుమారి, ఎంఇఒ టి.రామ్మూర్తి, వాసిరెడ్డి

చింతలపూడి ఎంపిడిఒ కార్యాలయంలో..

మధు, లయన్స్ క్లబ్ మండల కార్యదర్శి ఎల్.శ్రీనివాస రావు

జంగారెడ్డి గూడెంలోని పాఠశాలలో..

పాల్గొన్నారు.

చింతలపూడి : నేటి బాలలను రేపటి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు సమాజానికి ఎంతో ప్రయోజనకారులని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా తెలిపారు. చింతలపూడి మండలంలో గురుపూజోత్సవం పురస్కరించుకుని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ రాంబాబు ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు అస్కార్, రామలక్ష్మి బేబి, సుశీల, తెరిసమ్మ, ఎస్‌కె ఖాజా మోహిద్దీన్, అదే విధంగా ఉపాధ్యాయులు విమలాదేవి, సంజీవకుమార్ రామకృష్ణ, ప్రభావతి, వరప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, జడ్‌పిటిసి మోలుగుమాటి నీరజసుధాకర్, మిర్యాల దిలిఫ్, గుత్తా కిషోర్, వరలక్ష్మి, ఎంఇఒ రామారావు, ఎంఇఒ-2 కిరణ్ బాబు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


టి.నరసాపురం పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

చాట్రాయి : ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా గురుపూజోత్సవం కార్యక్రమాన్ని స్థానిక చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి వివిఎస్ వి.బ్రహ్మచారి అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులైన గుడ్డేటి.వినోద్ కుమార్ ఎంపిపి పాఠశాల కొత్తగూడెం, దావులూరి గ్లేడియస్ కృపావతి ఎంపిపి పాఠశాల చాట్రాయి, ఆడిమెల్లి రమేష్ ఎంపియుపి పాఠశాల తుమ్మ గూడెం, షేక్ షరీఫునిషా ఎంపియుపి పాఠశాల చిన్నంపేట, దారా వినోద్ కుమార్ ఎంఐఎస్ కోఆర్డినేటర్ చాట్రాయి వీరిని దేశి రెడ్డి రాఘవరెడ్డి, ఉపాధ్యాయులు ఉత్తమ సేవాపురస్కార అవార్డుతో ఘనంగా సన్మానించారు.

కలిదిండిలో ఎంఇఒను సత్కరిస్తున్న నేతలు..

ఈ కార్యక్రమంలో ఎంపీపీ లంక నిర్మల, గ్రామ సర్పంచి దామెర ఉష, ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్, తహశీల్దార్ సిహెచ్ విశ్వనాథరావు పాల్గొన్నారు.

కలిదిండి : ఎపి ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఇఒ పిప్రభాకర్ బాబును ఘనంగా సన్మానించారు. అప్సా ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షులు చన్నంశెట్టి కృష్ణ, పాఠశాలల అధినేతలు జివి సత్యన్నారాయణ రాజు, సానా మీనా సరస్వతి, రుద్రపాక సాగర్ శర్మ, ఎస్‌వి రామారావు, ఎల్ఆర్ పోలిశెట్టి పాల్గొన్నారు. స్థానిక సుగుణ కళాశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే స్థానిక ఎఎంసి కార్యాలయంలో మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 8 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను కైకలూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు సన్మానించారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

సచివాలయాల పరిధిలో నూతనంగా మంజూరైన ఫించన్లను సర్పంచి పొడుం పుష్ప, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచి పొడుం పుష్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగా దఫదఫాలుగా ఫించన్ పెంచుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీను, ఎంపిటిసిలు యామల శ్రీదేవి పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఫొటోతో ముద్రించిన రూ.100 నాణెం ఆవిష్కరణ

టి.నర్సాపురం : మండల కేంద్రమైన టి.నర్సాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మండం ఆదిత్య కుమార్ ఇటీవల ప్రభుత్వం ముద్రించిన టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ రూ.100 నాణేన్ని కొనుగోలు చేసినట్లు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా భీమవరంలో మాజీ ఎంపీ మాగంటి బాబు చేతులమీదుగా ఆ నాణేన్ని ఆవిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టి.నర్సాపురం మాజీ మండలపార్టీ అధ్యక్షులు పిన్నమనేని మధు, బిసి సెల్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండపల్లి రవి, అక్కిన శేషు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'

సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వరి..

ఏలూరు : సమాజంలో కాలుష్యం పెరిగిపోయిందని, దీన్ని నివారించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, నేషనల్ గ్రీన్ క్రిమినల్ ఆదేశాల ప్రకారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్తంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అధ్యక్షతన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ వినాయక చవితిని నిర్వహించుకునేందుకు ముందస్తు చర్యలు, అవగాహనపైన చర్చించడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు లోబడి విగ్రహాలను తయారు చేయడం, నిమగ్న కార్యక్రమాలు ఉండాలన్నారు. మట్టి విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నివారణ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, ఎన్‌జిఒలు పాల్గొన్నారు.

12న సెయింట్ థెరిస్సా కళాశాలలో యువజనోత్సవాలు

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్, ఏలూరు వారి అధ్వర్యంలో కమిషనర్ ఆఫ్ యువజన సర్వీసుల శాఖ, జిల్లా కలక్టరు ఆదేశాలననుసరించి జిల్లా స్థాయి యువజనోత్సవాలు సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాల, ఏలూరులో ఈనెల 12వ తేదీన నిర్వహించబడును. ఆసక్తి గల యువతీ యువకులు ఈ పోటిలలో పాల్గొనవచ్చని సెట్‌వెల్‌సిఇఒ యండిహెచ్ మెహరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రథమ స్థాయిలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపబడునన్నారు. ఆసక్తి ఉన్న 15 నుంచి 29 సంవత్సరముల వయస్సు కలిగిన యువతీ యువకులు వారి బయోడేటా, పోటీచేయు అంశములను step.westgodavari@gmail.comకు ఇ-మెయిల్ ద్వారా, 9949109522 కు పంపవలెనన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

విద్యాశాఖామంత్రిచే అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

పోతేపల్లి ఉపాధ్యాయునుకి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ప్రజాశక్తి - ద్వారాకాతిరుమల

ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంను ద్వారాకాతిరుమల మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సిహెచ్ పోతేపల్లి నుంచి కట్టా శ్రీనివాసరావు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా తూమాటి విజయలక్ష్మి

ముసునూరు : ముసునూరు మండలం కాట్రేనిపాడు పంచాయతీ హరిచంద్రపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని తూమాటి విజయలక్ష్మికి 2023వ సంవత్సరానికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీ చేతుల మీదగా మంగళవారం జిల్లా ప్రభుత్వ కార్యాలయంలో అందజేశారు.

ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని, విజయలక్ష్మి పిల్లలందరినీ పాఠశాల బాట పట్టించడం, హాజరు శాతాన్ని మెరుగుపరచడం, విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడం, విద్యారంగంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్నటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలను పాఠశాలలో అమలు పరచడం, పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం మొదలగు అంశాలను గుర్తించి ఈ అవార్డును ఇస్తున్నట్లుగా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత తూమాటి విజయలక్ష్మిని ముసునూరు మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు అభినందించారు.

కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి

విశాఖలో అల్లు శ్రీనుకి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ఉంగుటూరు : వైజాగ్ ఆంధ్ర యునివర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించింది. ఉప్పాకపాడు ఫౌండేషన్ ప్లస్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేయుచున్న అల్లుశ్రీనుకి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ సుభద్ర సాలువ కప్పి సన్మానించారు. అల్లు శ్రీనుకి మెమెంటో, మెడల్, సర్టిఫికెట్ బహూకరించారు. ప్రోత్సాహకంగా ఇవ్వబోయే రూ.20వేలు వృద్ధాశ్రమానికి, అనాథాశ్రమానికి విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అవార్డు గ్రహీతలు అందరి వద్దకు వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటి శాఖామంత్రి గుడివాడ అమర్నాధ్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు, విద్యాశాఖ కమీషనర్ సురేష్, డైరెక్టర్లు, దేవానందరెడ్డి, ప్రతాప్ రెడ్డి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అల్లు శ్రీనుని ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు అభినందించారు.

వైజాగ్‌లో అవార్డు అందుకున్న శ్రీను..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

టి.నరసాపురం : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని వెలగపాడు గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న బాలరాజు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు, ఎంపీపీ డి.లక్ష్మి పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

నూజివీడు రూరల్ : పాత రావిచర్ల గ్రామంలో దోమల నివారణకు వైద్య, ఆరోగ్య సిబ్బంది మంగళవారం ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి ఎం.ఎలమంద మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ కె.సునంద, హెల్త్ అసిస్టెంట్ పి.సారథి, ఎఎన్ఎం పాల్గొన్నారు.

మదర్సా నిర్వాహకుల వద్దకు పిల్లలు

నూజివీడు రూరల్ : బోరవంత గ్రామంలో ఉన్న మదర్సాలో ముగ్గురు పిల్లలు తల్లిదండ్రులపై ఉన్న బెంగతో బయటకు వెళ్లిపోయారు. అయితే వీరు ఆగిరిపల్లి వైపు వస్తున్నారన్న సమాచారం మేరకు ఆగిరిపల్లి ఎస్ఐ నంబూరు చంటిబాబు తన సిబ్బందితో గాలించి వారిని పట్టుకున్నారు. తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి మదర్సా నిర్వాహకులకు పిల్లలను అప్పగించారు.

పశువుల గణన సక్రమంగా నిర్వహించాలి

నూజివీడు రూరల్ : పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన పశువుల గణన కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని నూజివీడు ఎంపిడిఒ విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో పశువుల గణన కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆయన కోరారు.

ఆశాలకు, ఆరోగ్య కార్యకర్తలకు వర్క్‌షాపు

నూజివీడు రూరల్ : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో తూర్పు దిగవల్లి, గొల్లపల్లి రెండు గ్రామాల్లోని పిహెచ్‌సిలలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైనవారిని డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని, పొలసానిపల్లిలో ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ ఏర్పాటు చేసిన బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఉన్నాయన్నారు.

స్టీల్ గ్లాసులు, ప్లేట్లు అందజేత

జంగారెడ్డిగూడెం : అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించడంలో దాతల సహకారం హర్షణీయమని డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకర్‌రావు తెలిపారు. మంగళవారం డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీతానగరం అంగన్‌వాడీ కేంద్రానికి 20 స్టీల్ గ్లాసులు, ప్లేట్లు అందించారు.

విక్రయ దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, వడ్లమాను గ్రామానికి చెందిన పందేటి నరశింహులు గారి కుమారుడు పందేటి జయబాబుకు చెందిన ఆర్.యస్. నెం. 349/5రు దాఖలా య. 0.05 -1/2 సెంట్లు నివేశన స్థలానికి సంబంధించిన విక్రయ దస్తావేజు (నెం. 5494/2011) ఒరిజినల్ పోయినది. ఆచూకీ తెలిసినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

పందేటి జయబాబు
S/o. నరశింహులు
వడ్లమాను గ్రామం, ఆగిరిపల్లి మండలం
ఏలూరు జిల్లా
సెల్: 7729807928

దస్తావేజు పోయినది

నల్లంటి ఇందిరా ప్రియదర్శిని, D/o. సుబ్బారావు అను నేను తెలియజేయునది ఏమనగా, నా పేరున జంగారెడ్డిగూడెం S.R.O నందు ది. 24-10-2011 న Doc. No. 8606/2011 గా రిజిస్ట్రేషన్ చేయబడిన దస్తావేజు ది. 10-8-2023న టి.నరసాపురం మెయిన్ సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయమునకు వచ్చే మార్గమధ్యలో పడిపోయినది. దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

నల్లంటి ఇందిరా ప్రియదర్శిని
D/o. సుబ్బారావు, H.No. 23-16
సిప్రియన్‌పేట, చింతలపూడి
సెల్: 79897 68382

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS :: GUNTUR
Dispute No.109/2022

Between :
M/s.Margadarsi Chit Fund Pvt.Ltd., Market Centre, Guntur. .... Disputant
And
Mr.P.Ignatius and Others .... Opponents
To
OPP. NO.5: MR.PUTCHAKAYALA BALA SUNDARA RAO, S/O. P.VENKATESWARLU, RES:D.NO.10-41-1, BESIDE BYPASS ROAD, NEAR RCM CHURCH, TANUKU, WEST GODAVARI DIST – 534 211.

Please take notice that the above dispute is filed against Opponent No.5 for Recovery of Rs.76,997/- (Rupees Seventy Six Thousand Nine Hundered and Ninty Seven Only) and the same is posted to Dt.26-09-2023 for the appearance of you before the Deputy Registrar of Chits O/o District Registrar, Guntur at 10:30 a.m. If you fail to attend the office of Deputy Registrar of Chits on that day the matter will be heard and decided exparte basis on the material available.

(By order of the Deputy Registrar of Chits)
Foreman / Branch Senior Manager,
Margadarsi Chit Fund Pvt, Ltd.,
Market Centre, Guntur.